సంపుటి :03 | సంచిక :39 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

మంగళవారం 17, మార్చి 2026

## పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షాక్

- డ్రగ్స్ కేసులో షోకాజ్
- ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీస్

05



## డ్రగ్స్ కేసులో 'సిట్' నియామకం

- చీఫ్‌గా డీసీపీ యోగేశ్ గౌతమ్
- మలుపు తిరిగిన మొయినాబాద్ ఫాంహౌస్ కేసు

05

## పక్కా ప్రణాళికలు సిద్ధం చేయండి

- నగరంలో వరద ముంపు నివారణపై హనుమకొండ జిల్లా కలెక్టర్
- నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం.. సమగ్ర సర్వేకు ఆదేశం
- ఇంజనీరింగ్, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలతో కీలక భేటీ



# క్వారీ దోపిడీ !

### ఇసుక క్వారీల్లో బలవంతపు వసూళ్లు

### మైనింగ్ శాఖకు డీడీలు చెల్లించినా.. మామూళ్ల పర్వం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలంలోని ఇసుక క్వారీలు ప్రస్తుతం అక్రమ వసూళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఇసుక తరలింపు కోసం లారీ యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఆన్‌లైన్ ద్వారా డీడీలు తీసినప్పటికీ, క్వారీ నిర్వాహకుల కాసుల దాహం తీరడం లేదు. ఒక్కో లారీకి లోడింగ్, కూలీలు, జేసీబీ, కాంటా, సీరియల్ పేరుతో బలవంతంగా అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఈ లెక్కన ఐదు క్వారీల పరిధిలో రోజుకు అక్షరాలా రూ.లక్షలు అక్రమంగా చేతులు మారుతున్నట్లు అంచనా. ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక 'మామూళ్ల' మర్మం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. – అక్షరదర్బార్, హనుమకొండ

02

- ఒక్కో లారీ లోడింగ్‌కు రూ.1700 కలెక్షన్
- లేబర్ చార్జీలు రూ.1,200.. కాంటా వద్ద రూ.200
- జేసీబీకి రూ.200.. ఇంకా ఎన్నో చెల్లింపులు
- అన్నీ.. కలిపి సుమారు రూ.4 వేల వరకు జేబు ఖాళీ
- ఇందేంటని ప్రశ్నిస్తే.. నచ్చితే లోడ్ చేయించుకో.. లేదంటే వెళ్లిపో.. అంటూ వ్యాఖ్యలు
- బెంబేలెత్తుతున్న లారీ యజమానులు
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న టీజీఎండీసీ.. సర్కార్ పట్టించుకోవాలని వినతి

# రీల్స్.. రియల్ లైఫ్ విషాదం!

### ఐదు నెలల గర్భిణి అని చూడకుండా భార్యను హతమార్చిన భర్త

### జగిత్యాల జిల్లా మాదాపూర్‌లో కిరాతకం..

### ప్రేమ వివాహం చేసుకున్న రెండేళ్లకే నూరేళ్ల మంట!

02



సోషల్ మీడియాలో 'రీల్స్' చేస్తూ అన్యోన్యంగా కనిపించిన ఆ జంట మధ్య ఉన్న చిన్నపాటి చిచ్చు కాస్తా ప్రాణం తీసే స్థాయికి చేరింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తే కాలయముడిగా మారి.. కడుపులో పెరుగుతున్న బిడ్డను కూడా చూడకుండా కట్టుకున్న భార్యను కడతేర్చాడు. జగిత్యాల జిల్లా మాదాపూర్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ కిరాతక ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ విషయంలో తలెత్తిన వివాదం చివరకు కత్తితో దాడి చేసి, గోడకేసి బాదేంత వరకు వెళ్లడంతో ఐదు నెలల గర్భిణి వైష్ణవి (21) అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. నిందితుడు హరిబాబు పరారవ్వగా, బాధితురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట భారీ ఆందోళనకు దిగారు. కళ్ళముందే తిరిగిన బిడ్డ కనుమరుగవడంతో ఆ గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.

- జగిత్యాల ప్రతినిధి (అక్షరదర్బార్)



# ఇది.. 10 నోట్ క్రైం చిత్రం!

### హవాలా సొమ్ము.. రూ.కోటి

- దానికి కోడ్ 10 నోట్
- ఇద్దరు నిందితులు నోట్ ఇవ్వగానే చేతిలోకి సొమ్ము
- బైక్‌పై వెళ్తుండగా.. కళ్లలో కారంకొట్టి అపహరణ
- దుండగులు ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్

కూకట్‌పల్లిలో జరిగిన భారీ దారి దోపిడీ కేసు చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. ఒక్క పది రూపాయల నోటుతో మొదలైన ఈ హైడ్రామా శంషాబాద్ వద్ద నిందితుల అరెస్టుతో ముగిసింది. అక్షరాలా కోటి రూపాయల హవాలా నగదును కేవలం రెండే నిమిషాల్లో దోచుకున్న నిందితులను సైబరాబాద్ పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. హవాలా దందాలో పది రూపాయల నోటు అత్యంత కీలకంగా మారింది.

– అక్షరదర్బార్, హైదరాబాద్

02

అక్షర దర్బార్ Voice of the people




- ఇసుక క్వారీల్లో బలవంతపు వసూళ్లు
- మైనింగ్ శాఖకు డీడీలు చెల్లించినా.. మామూళ్ల పర్వం
- ఒక్కో లారీ లోడింగ్‌కు రూ.1700 కలెక్షన్
- లేబర్ చార్జీలు రూ.1,200.. కాంటా వద్ద రూ.200
- జేసీబీకి రూ.200.. ఇంకా ఎన్నో చెల్లింపులు
- అన్నీ.. కలిపి సుమారు రూ.4 వేల వరకు జేబు ఖాళీ
- ఇందేంటని ప్రశ్నిస్తే.. నచ్చితే లోడ్ చేయించుకో.. లేదంటే వెళ్లిపో..అంటూ వ్యాఖ్యలు
- బెంబేలెత్తుతున్న లారీ యజమానులు
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న టీజీఎండీసీ.. సర్కార్ పట్టించుకోవాలని వినతి

# క్వారీ దోపిడీ!

అక్షరదర్బార్, హనుమకొండ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలంలో ఇసుక క్వారీ నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. వారికి కాసుల దాహం లారీ యజామానులకు ఆర్థికపరమైన భారంగా మారింది. లారీ యజమానులు ఇసుక లోడింగ్ కోసం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసి డీడీ తీసుకుని, క్వారీ వద్ద వే బిల్లు తీసుకున్నప్పటికీ.. వారు అదనంగా ఒక్కో లారీకి సుమారు రూ.4 వేలకు పైగా చెల్లించాల్సి వస్తున్నదని తెలిసింది. లోడింగ్ పూర్తయిన తర్వాత, ఇసుక రవాణా ఏమైనా సాఫీగా సాగుతుందా.. అంటే అదీ లేదు. లారీ గమ్యస్థానం చేరుకునే వరకు మధ్య మధ్యలో అమ్యామ్యాలు పంచుతూ వెళ్లాల్సిందే. ఈ మండలంలో మొత్తం 5 క్వారీలో ఉండగా ప్రతి క్వారీలో ఇదే పరిస్తితులు నెలకొన్నాయి. ఈ పరిణామం లారీ యజమానులను ఇబ్బంది పెడుతున్నది.

## - చదివింపులు ఇలా..

లారీ ఒకసారి క్వారీలోకి ప్రవేశించగానే ముందు లారీ యజమాని లోడింగ్ కు మొదట రూ.1,700 చెల్లించాలి. తర్వాత కూలీ ఖర్చులు రూ.1,200, అలాగే కాంటాకు రూ.200, జేసీబీకి రూ.200 చొప్పున చెల్లించాలి. అక్కడిత ◌ోనే దోపిడీ ఆగదు.. తర్వాత సీరియల్ కు, రూ.100 డీడీ ఎంటర్ చేసినందుకు, రిటన్ లో దారిలో ఫారెస్ట్ చెక్ పోస్ట్ కాటారం వద్ద రూ.200.. ఇలా.. యజమాని ఒక్కో లారీకి సుమారు రూ.4 వేల వరకు సమర్పించుకోవాల్సి వస్తోంది. ఒక్కో క్వారీలో ప్రతిరోజూ 100 నుంచి 200 లారీల వరకు లోడింగ్ జరుగుతున్నట్లు సమాచారం. అంటే.. ఒక్కో లారీకి యజమాని రూ.4 వేల చొప్పున చెల్లిస్తున్నాడంటే, ఒక్కో క్వారీ పేర రోజుకు మొత్తంగా అందరు లారీ యజమానులు కలిసి దాదాపు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు అదనంగా చెల్లిస్తున్నారన్నమాట. అంటే... ఐదు క్వారీల పరిధిలో రోజుకు అక్షరాలా రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు అదనపు వసూళ్లు జరుగుతున్నాయనేది సుస్పష్టంగా తేలుతున్న విషయం.

## - ఇష్టం లేకపోతే.. వెళ్లిపో..


ఒక్క సారి లారీ క్వారీలోకి ప్రవేశించిందంటే, నిర్వాహకులు ఎక్కడ ఎంత చెప్తే అంత లారీ యజమాని చెల్లించాల్సిందే. లేదంటే.. ఎవరైతే ప్రశ్నించారో, నిర్వాహకులు ఆ లారీని పక్కన పెడతారు. లారీ యజమాని ఇంకా తెగించి, నిలదీస్తే.. నీకు నచ్చితే.. అడిగినంత డబ్బు చెల్లించి, ఇసుక లోడ్ చేయించుకో... నచ్చకపోతే.. ఇక్కడి నుంచి లారీ తీసుకొని వెళ్లిపో అని నిర్వాహకులు తేల్చిచెప్తున్నారు. అయితే.. చచ్చీ చడి, వ్యయప్రయాసల కోర్చి క్వారీ వరకు లారీ తెచ్చిన యజమానికి చివరకు రాజీ పడుతున్నాడు. ఇప్పటికే డీడీ కట్టాం. లారీ క్వారీ దాకా వచ్చేందుకు డీజిల్ కాలింది. ఉత్తి చేతులతో ఏం లాభం ? అనుకుని చేసేదేం లేక, డబ్బులు చెల్లిస్తున్నాడు. ఒక్క లారీకి రూ.4 వేల చొప్పున భారమంటే.. మరి సదరు లారీ యజమాని, బయటకు తెచ్చిన ఇసుకను ఎంతకు అమ్మాలి? కచ్చితంగా ఎక్కువ ధరకు అమ్మాల్సిందే. అంటే.. మళ్లీ ఆ భారం వినియోగదారుడిపైనే పడుతుంది.

## - పరిస్థితి చక్కదిద్దాలి..

మహాదేవ్‌పూర్ మండలంలోని ఈ 5 క్వారీ నిర్వాహకుల దందా మూడు పూవులు ఆరు కాయలు అన్నట్లు సాగుతున్నా, మైనింగ్ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ అధికారులు చాలా `మామూలు`గా తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికైనా మైనింగ్ శాఖ అధికారులు స్పందించి, అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని, క్వారీల్లో పారదర్శకంగా ఇసుక లోడింగ్ జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని లారీల యజమానులు కోరుతున్నారు.

# ప్రేమ.. పెళ్లి.. రీల్స్ ఇంతలోనే విషాదం

- భార్యపై కత్తితో దాడి చేసిన చంపిన భర్త
- జగిత్యాల జిల్లా మాదాపూర్ లో ఘటన



అక్షరదర్బార్, జగిత్యాల : భార్య రీల్స్ విషయంలో జరిగిన గొడవ చివరకు విషాదాంతంగా ముగిసింది. భర్త ఆమె ప్రాణాలను తీశాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వైష్ణవి (21), కోరుట్ల పట్టణానికి చెందిన చిత్తారి హరిబాబు గత రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. హరిబాబు తల్లిదండ్రులు వీరి పెళ్లికి నిరాకరించడంతో, అతను భార్య స్వగ్రామమైన మాదాపూర్ లోని అత్తగారి ఇంట్లోనే ఉంటూ వస్తున్నాడు. ఈ జంట సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఇన్‌స్టాగ్రాం రీల్స్ చేసేవారు. చూసేవారికి అన్యోన్యంగా ఉన్నట్లు కనిపించినా, వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. మంగళవారం తెల్లవారుజామున ఇద్దరి మధ్య చిన్న గొడవ మొదలైంది. అది కాస్తా పెరిగి పెను వివాదంగా మారింది. ఆవేశానికి లోనైన హరిబాబు విచక్షణ కోల్పోయి వైష్ణవిపై కత్తితో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా ఆమెను గోడకేసి బలంగా బాదడంతో వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా భర్త చేసిన కిరాతకానికి వైష్ణవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. వైష్ణవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన బిడ్డను అన్యాయంగా చంపిన హరిబాబును కఠినంగా శిక్షించాలంటూ వైష్ణవి బంధువులు ఆసుపత్రి ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. డీఎస్పీ అడ్డూరి రాములు, సీఐ సురేష్, ఎస్సైలు భారీ బందోబస్తు నిర్వహించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. హత్య చేసిన తర్వాత హరిబాబు పరారవ్వగా, పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# ఇది.. 10 నోట్ క్రైం చిత్రం!




- హవాలా సొమ్ము.. రూ.కోటి
- దానికి కోడ్ 10 నోట్
- నోట్ ఇవ్వగానే చేతిలోకి సొమ్ము
- బైక్ పై ఇద్దరు వెళ్తుండగా.. కళ్లలో కారంకొట్టి అపహరణ
- దుండగులు ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్

అక్షరదర్బార్, హైదరాబాద్ : కూకట్‌పల్లిలో జరిగిన భారీ దారి దోపిడీ కేసు చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. ఒక్క పది రూపాయల నోటుతో మొదలైన ఈ హైడ్రామా శంషాబాద్ వద్ద నిందితుల అరెస్టుతో ముగిసింది. అక్షరాలా కోటి రూపాయల హవాలా నగదును కేవలం రెండే నిమిషాల్లో దోచుకున్న నిందితులను సైబరాబాద్ పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. హవాలా దందాలో పది రూపాయల నోటు అత్యంత కీలకంగా మారింది. బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ మంగళవారం ఒక వ్యాపారి వద్దకు వెళ్లారు. తమ వద్ద ఉన్న పది రూపాయల నోటును సీక్రెట్ కోడ్‌గా చూపించారు. ఆ నోటు మీద ఉన్న సీరియల్ నంబరు సరిపోవడంతో ఒప్పందం ఖరారైంది. ఆ వెంటనే ఒక కోటి రూపాయల నగదు వారి చేతులు మారింది. పక్కా సినిమా స్కెచ్‌ను తలపించేలా ఈ లావాదేవీ జరిగింది. డబ్బు తీసుకుని వెళ్తున్న బాధితులను దుండగులు మార్గమధ్యంలో అడ్డగించారు. నగదు ఎప్పుడు ఎక్కడ నుంచి తరలిస్తున్నారో నిందితులకు ముందే తెలుసు. సమయం చూసి వాహనాన్ని ఆపిన నలుగురు దుండగులు బాధితుల కళ్లలో కారం కొట్టారు. ఆ కోటి రూపాయల బ్యాగును లాక్కుని మెరుపు వేగంతో అక్కడి నుంచి పరారయ్యారు. దోచుకున్నది హవాలా సొమ్ము కావడంతో బాధితులు మొదట పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు భయపడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా వేట మొదలుపెట్టారు. పక్కా సమాచారంతో శంషాబాద్ వద్ద నిందితులను చుట్టుముట్టారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 77 లక్షలకు పైగా నగదును రికవరీ చేశారు. పది రూపాయల నోటు కోడ్‌తో ప్రారంభమైన ఈ భారీ హవాలా దోపిడీ కథ నిందితుల అరెస్టుతో సుఖాంతమైంది.

# 20న కేబినెట్ భేటీ

## - బడ్జెట్ కు ఆమోద ముద్ర

అక్షరదర్బార్, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. అసెంబ్లీ కమిటీ హాల్లో ఉదయం 9.30 గంటలకు ఈ కీలక భేటీ ప్రారంభం కాబోతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు దానికి మంత్రివర్గ ఆమోదం తెలపడమే ఈ సమావేశం ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో, ఈసారి బడ్జెట్‌లో ఎలాంటి కొత్త పథకాలు ప్రవేశపెడతారు? వేటికి ప్రాధాన్యత ఇస్తారు? అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

## –బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ డా. చందుపట్ల కీర్తి రెడ్డి

అక్షర దర్బార్, చిట్యాల : బీజేపీ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ ప్రజలతో మమేకం కావాలని భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ డా. చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు. మంగళవారం చిట్యాల మండలం జుకల్లులోని పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్–2026 శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కీర్తి రెడ్డి మాట్లాడుతూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే విధానాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన "ఏకాత్మ మానవ దర్శనం" బీజేపీ యొక్క ప్రాథమిక సిద్ధాంతమని తెలిపారు. ప్రతి కార్యకర్త ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్ రాష్ట్ర నాయకులు వెన్నం పెల్లి పాపయ్య చదువు రామచంద్ర రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవికిరణ్ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ వేణు గోపాల్ రెడ్డి గు నాగరాజుగౌడ్ సర్పంచులు ఉప సర్పంచులు గొర్రె శేషి కుమార్ తిరుపతి శ్రీధర్ కుమారస్వామి జరుపూల శ్రీను రాజేందర్ మండల నాయకులు



మోరే రవీందర్ రెడ్డి తీగల జగ్గయ్య చెక్క నరసయ్య మండల మొగిలి దేశెట్టి గోపాల్ కూర మైపాల్ రెడ్డి మైదం శ్రీకాంత్ చింతల రాజేందర్ కేంసారపు ప్రభాకర్ రాయిని శ్రీనివాస్ గాజనల రవీందర్ గోపగాని స్వామి నీలి సుధాకర్ రెడ్డి శ్రావణ్ ప్రశాంత్ వెంకటేశ్వర్లు పూర్ణతదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలోని చిట్యాల, తిరుమలపూర్, జూకల్ గ్రామాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు అధ్యక్షులుగా సర్పంచులు తౌటం లక్ష్మి , ఎలగొండ సంధ్య, జన్న సురేష్ ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శులుగా ఐసిడిఎస్ టీచర్లు బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, గ్రామ పోలీసు అధికారి, పంచాయతి కార్యదర్శులు, ఎన్‌జీఓ సిబ్బంది, కుల సంఘాల పెద్దలు ఉంటారు. ఈ కమిటీలు బాలల హక్కులను పరిరక్షించడం, బాల్య వివాహాల నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తాయని ఐసిడిఎస్ చిట్యాల మండల సూపర్వైజర్ జయప్రద తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగపు సిబ్బంది సోషల్ కుమార్, గుర్రం తిరుపతి, మండల ఇన్‌చార్జి కళావతి పాల్గొన్నారు.

# మరిపెడ అభివృద్ధికి కృషి చేయాలి

## –మాజీ ఎంపీ సురేందర్ రెడ్డిని కలిసిన మరిపెడ చై పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డికి

అక్షరదర్బార్, మరిపెడ : మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి మంగళవారం మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆశీస్సులు పొందారు. చైర్‌పర్సన్‌ను అభినందించిన సురేందర్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రు నాయక్ నాయకత్వంలో మరిపెడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అలవాల ఉపేందర్ ప్రజాపతి, గంధసిరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

## –ఏవైఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య డిమాండ్

అక్షర దర్బార్, చిట్యాల : పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపు సామాన్య ప్రజలపై భారంగా మారిందన్నారు. రోజువారీ కూలీలకు ఇది తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. గ్యాస్ కొరత లేదని



చెప్పినా, బ్లాక్ మార్కెట్‌లో అక్రమ విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణమే ధరలను తగ్గించకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాంబయ్య, పుల్ల అశోక్, కట్కూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



# బాలాజీ టెక్నో లో ఎన్సీసీ విద్యార్థుల ఎంపికలు

అక్షర దర్బార్, నర్సంపేట : మండలంలోని లక్నేపల్లి గ్రామంలో గల బాలాజీ టెక్నో స్కూల్ (సీబీఎస్ఈ)లో 2026–27 విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికలను మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపికల్లో మొత్తం 319 మంది విద్యార్థులు పాల్గొనగా, 50 మంది ఎంపికయ్యారు. హవల్దార్ కమలాకర్, నిషాద్ మరియు ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ ఎం.డి. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో పరుగు పందెం, లాంగ్ జంప్ వంటి శారీరక, మానసిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ పి. రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ అనేది భారత సాయుధ దళాల యువ విభాగమని, ఇది విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి పెంపొందిస్తుందని తెలిపారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్స్‌తో కూడిన శిక్షణ ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఏ, బి, సి సర్టిఫికెట్లు అందజేస్తారని, ఇవి ఉద్యోగ అవకాశాల్లో అదనపు ప్రయోజనం కలిగిస్తాయని వివరించారు.



# రైతులకు రాయితీలను అందజేయాలి

## కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

అక్షర దర్బార్, పరకాల: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు సకాలంలో రాయితీలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం ప్రభుత్వ రాయితీతో డ్రిప్పు విధానంలో హనుమకొండ జిల్లా దామెర మండలం పులకుర్తి లో ఆయిల్ పంప్ పంట, నడికూడ మండలం నర్సక్క పల్లి లో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిర్చి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత రైతులకు ప్రభుత్వం నుండి రాయితీపై వచ్చిన డ్రిప్పు పరికరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా పంటలకు సంబంధించిన వివరాలను రైతులు, ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ మొక్కను జిల్లా కలెక్టర్ నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్, మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిర్చి పంటల రైతులు రాయితీని సద్వినియోగం చేసుకొని మంచి లాభాలు వచ్చే విధంగా పంట ఉత్పత్తి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ, పరకాల ఆర్డీఓ నారాయణ, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.






# మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన


అక్షర దర్బార్, భూపాలపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ర్యాగింగ్ శిక్షార్హ నేరమని, అలాంటి చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మెడికల్ విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాల్సిన బాధ్యత ఉందని, పరస్పర గౌరవం, స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని తెలిపారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతారని పేర్కొంటూ, కళాశాలలో సురక్షితమైన వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ర్యాగింగ్ ఘటనలు గమనించిన వెంటనే యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే హెల్ప్‌లైన్ 1800–180–5522 లేదా డయల్ 100 వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చేతి పంపుల మరమ్మతులు

### తాగునీటి ఎద్దడి నివారణపై సర్పంచ్ దృష్టి

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య నివారణకు సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ ముందడుగు వేశారు. గ్రామంలోని చెడిపోయిన చేతిపంపులను మరమ్మతు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మరమ్మతుకు నోచుకోని చేతిపంపులను సక్రమంగా రిపేర్ చేయించినట్లు వివరించారు. అలాగే గ్రామంలో తాగునీరు సరఫరా చేసే పైపులలో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు.గ్రామంలో ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా చూడటం లక్ష్యంగా పని చేస్తున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



## ములుగు ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా మునీందర్ బాధ్యతలు

అక్షర దర్బార్, ములుగు : ములుగు ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా దాసరి మునీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయనను రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ కమిషనర్, హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు డిప్యూటేషన్‌పై నియమించారు. ఇంతకు ముందు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన దిలీప్ చంద్ర గోపాల్ కరీంనగర్ డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మునీందర్‌ను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేశారు. ములుగు జిల్లాలో సబ్ రిజిస్ట్రార్‌గా మంచి పేరు తెచ్చుకునే విధంగా పనిచేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని మునీందర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు అవసరమైన పత్రాలు సకాలంలో సమర్పించి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది స్రవంతి, రాజేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

అక్షర దర్బార్, దుగ్గొండి : ఉపాధి హామీ పనులను గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రేకంపల్లి గ్రామ సర్పంచ్ కొలువురు సుజాత సూచించారు. మంగళవారం మండలంలోని రేకంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామస్తులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో కాలంలో గ్రామస్తులు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ వేముల అశోక్ రెడ్డి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ తోఫాల పంపిణీలో నిర్లక్ష్యం

### –మాజీ కోఆప్షన్ మెంబర్ ఫాతిమా హమీద్



అక్షర దర్బార్, పరకాల : రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు అందించాల్సిన గిఫ్ట్ ప్యాక్స్ పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొన్నదని మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు ఫాతిమా హమీద్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం పండుగకు ముందు పేదలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తొఫాలు పంపిణీ చేస్తుందని, సాధారణంగా పండుగకు 10 రోజుల ముందే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అయితే రంజాన్ మాసం ముగియడానికి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండగా ఇప్పటికీ పట్టణంలో పంపిణీ ప్రారంభం కాలేదని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తూ, ఆలస్యానికి గల కారణాలను తెలుసుకొని వెంటనే అర్హులైన ముస్లిం పేదలకు తొఫాలు అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## శివాజీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు

### పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ సునీల్



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని సీతారాంపురం రాజుపేట కాలనీలో ఉన్న శివాజీ జంక్షన్ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు జంక్షన్ అభివృద్ధితో పాటు శివాజీ మహారాజ్ విగ్రహ మరమ్మత్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఏఈ రంజిత్, విద్యుత్ శాఖ అధికారులతో చైర్మన్ స్థలాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆరె కుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మార్త భిక్షపతికి ఘన సన్మానం



అక్షర దర్బార్, పరకాల: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో జరిగిన 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ హాల్లో సేవా రత్న జాతీయ అవార్డు అందుకున్న  మార్త బిక్షపతికి పద్మశాలి బంధువులు పద్మశాలి మండల అధ్యక్షుడు దాసరి బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనకు ఆత్మీయంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందించిన భిక్షపతికి అవార్డు రావడం ఆనందకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఇంకా ఉన్నత సన్మానాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాస చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మంత్రి మహేందర్, పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు డా. మంత్రి కాశయ్య, 9వ వార్డ్ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు వెంటనే అమలు చేయాలి

### బీజేపీ నేతల డిమాండ్



అక్షర దర్బార్, పరకాల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు గాజుల నిరంజన్, కసగాని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి , గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా వంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు. రైతులకు రైతు భరోసా సమయానికి అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అర్హులైన వారికి పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతం చేయాలని కోరారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల సమస్యలను తక్షణమే తీర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిలు రాజ్ పురోహిత్ జయంత్ లాల్, దేవునూరి మేఘనాథ్, పరకాల కౌన్సిలర్స్ కుక్కల విజయ్ కుమార్, పూర్ణాచారి, ఆకుల లావణ్య శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, మార్త రాజభద్రయ్య, మార్త బిక్షపతి ,భాస్కరాచారి ,దంచనాల సత్యనారాయణ, దంచనాల కిరణ్, కానుగుల గోపీనాథ్, మెంతుల సురేష్, రేవంత్ సిద్ధూ పాల్గొన్నారు.



## గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

అక్షర దర్బార్, భూపాలపల్లి : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. మంగళవారం భూపాలపల్లిలోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్ గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, గ్యాస్ సరఫరా విధానం, నిల్వలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సమయానికి సరఫరా అందించాలని ఆదేశించారు. వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుకింగ్ క్రమాన్ని పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో గ్యాస్ కొరత లేదని పేర్కొంటూ, సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మి అవసరానికి మించి బుకింగ్స్ చేయవద్దని ప్రజలకు సూచించారు. సరఫరా పర్యవేక్షణ కోసం కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి  పాల్గొన్నారు.




## నర్సంపేటలో ఆఫ్-సైట్ మాక్ డ్రిల్ అవగాహన

### పాల్గొన్న చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

అక్షర దర్బార్, నర్సంపేట : పట్టణంలో మంగళవారం మెగా గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ టీమ్ ఆధ్వర్యంలో ఆఫ్–సైట్ మాక్ డ్రిల్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్యాస్ లీకేజీ లేదా అగ్నిప్రమాదాల సమయంలో ప్రజలు ఎలా స్పందించాలి, ఎలా సురక్షితంగా బయటపడాలనే అంశాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు మాక్ డ్రిల్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పోలీస్, ఫైర్ సర్వీస్, వైద్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడేందుకు కూడా ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, టౌన్ ఎస్సై గూడ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సూచన**



ములుగు, అక్షర దర్బార్: గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సూచించారు. మంగళవారం ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలోని "మన ఊరు–మన నర్సరీ"ను పరిశీలించి, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. గర్భిణీలు, శిశువులు, కిశోర బాలికలు, వృద్ధులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని వైద్యులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు శిబిరంలో 28 గర్భిణీలు, 20 శిశువులు, 25 కిశోర బాలికలు, 54 వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. కోత్తూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసుకుని గృహప్రవేశానికి సిద్ధం కావాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, రాయినిగూడెం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ నాగ అనేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజమణి, సూపర్ వైజర్స్ దేవమ్మ నిర్మల మేరీ పాల్గొన్నారు.




## గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్

- **నడికూడ చౌరస్తాలో పట్టుకున్న పోలీసులు**

అక్షరదర్బార్, పరకాల : గత సంవత్సరం చర్లపల్లి గ్రామంలో గంజాయి తరలింపు కేసులో పరారీలో ఉన్న నిందితుడిని పరకాల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసి 2.840 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మిగిలిన నిందితుడు పరుషవేణి వెంకటేష్ (25), పాల్వంచకు చెందిన వ్యక్తి, నడికూడ చౌరస్తా వద్దకు వచ్చినట్లు సమాచారం అందడంతో ఇన్స్పెక్టర్ వి. క్రాంతి కుమార్ సిబ్బందితో కలిసి అతన్ని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



## మార్చిలోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- **అధికారుల సమీక్షలో కలెక్టర్ స్నేహ శబరీష్**
- **పురోగతిలో 13 పంచాయతీ భవనాలు, 23 అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణాలు**

అక్షర దర్బార్, మహబూబాబాద్ : జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్ల పనులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సొంత భవనాలు లేని చోట నూతనంగా 21 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా, ప్రస్తుతం 13 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన 8 భవనాల నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 30 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు కాగా, 23 భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, మిగతావి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

గ్రామ, పట్టణ స్థాయిల్లో చేపట్టిన అంతర్గత అభివృద్ధి పనులు, సైడ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, భవనాల మరమ్మత్తుల విషయంలో వేగం పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, ఈఈ విద్యాసాగర్, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

## పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షాక్

- **డ్రగ్స్ కేసులో షోకాజ్**
- **ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీస్**

అక్షరదర్బార్, హైదరాబాద్ : మొయినాబాద్ డ్రగ్స్ కేసు ప్రకంపనలు రాజకీయ వర్గాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం సంచలన నిర్ణయంతో షాక్ ఇచ్చింది. డ్రగ్స్ వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ మంగళవారం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో మాదకద్రవ్యాల వినియోగం జరిగిందని, ఆ సమయంలో రోహిత్ రెడ్డి అక్కడే ఉన్నారనే మీడియా కథనాలను పార్టీ నాయకత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం పరిణామాలపై 7 రోజుల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పార్టీ ఆదేశించింది. అక్రమ కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉండటం పార్టీ విలువలకు, ప్రతిష్టకు విరుద్ధమని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నోటీసు జారీ చేసినట్లు ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ స్పష్టం చేశారు. సంతృప్తికరమైన వివరణ ఇచ్చే వరకు లేదా పార్టీ తుది నిర్ణయం తీసుకునే వరకు రోహిత్ రెడ్డి ఎటువంటి అధికారిక సమావేశాలకు, పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకూడదని పార్టీ స్పష్టం చేసింది. గడువులోపు సమాధానం ఇవ్వని పక్షంలో, ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే పార్టీ రాజ్యాంగం ప్రకారం కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## డ్రగ్స్ కేసులో 'సిట్'

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మూలాలను, అంతర్జాతీయ సంబంధాలను ఛేదించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఈ సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేయనుంది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీ ఈ కేసులో కీలకంగా మారింది. ఆ రోజు పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? అసలు డ్రగ్స్ సరఫరా ఎక్కడ నుంచి జరిగింది? అనే కోణంలో సిట్ లోతైన విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ దందా వెనుక అంతర్జాతీయ మాఫియా హస్తం ఉం దా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా దుబాయ్ నుంచి సాగుతున్న మా దకద్రవ్యాల నెట్‌వర్క్‌తో నిందితులకు ఉన్న పరిచయాలపై సిట్ ఆరా తీయనుంది. కేసు లో ప్రధాన నిందితుడు నమిత్ శర్మ తన రి యల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారా డ్రగ్స్ మనీని ఎలా మళ్లించాడనే ఆర్థిక లావాదేవీలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



## తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

అక్షరదర్బార్, నర్సంపేట : ప్రజా పాలన–పట్టణ ప్రగతి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట తహసీల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, కార్యాలయ పరిసరాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. 99 రోజుల కార్యక్రమం అమలు తీరును పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించడంతో పాటు సేవలను వేగవంతం చేయాలని చెప్పారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 22వ వార్డులో డ్రైనేజీ పనులు

- **నాణ్యతతో పనులు పూర్తి చేయాలి**
- **చైర్మన్ సునీల్ అధికారులకు సూచనలు**



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 22వ వార్డులో చేపడుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మంగళవారం పర్యవేక్షించారు. శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి చొరవతో టి యు ఎఫ్ ఐ డి సి ద్వారా మంజూరైన నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, కూరగాయల మార్కెట్ రోడ్ పరిధిలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించిన చైర్మన్, నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక 22వ వార్డు కౌన్సిలర్ అల్లె దశరథం, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సందీప్ రెడ్డి, సూపర్వైజర్ శివతో పాటు స్థానికులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915